క్లుప్తంగా...

కరపత్రం ఆవిష్కరణ

అడ్డగుట్ట: వినియోగదారుల హక్కులపై వారికి అవగాహన ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉందని వినియోగదారుల హక్కుల సంస్థ ప్రతినిధులు అన్నారు. శుక్రవారం సంస్థ సికింద్రాబాద్ నియోజకవర్గం అధ్యక్షుడు తాండ్ర రమేష్ నేతృత్వంలో సంస్థ ప్రతినిధులు హైదరాబాద్ జిల్లా పౌర సరఫరాల అధికారి రమేష్‌ను కలిసి ఆయన చేతుల మీదుగా వినియోగదారుల హక్కులపై అవగాహన కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సంస్థ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రామగిరి హరిబాబు, అనిల్, బాల దుర్గానాథ్, సంతోష్, మల్లేష్, దేవానంద్, ప్రవీణ్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి వినతి



ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూకు వచ్చిన యూజీసీ చెర్మన్ ప్రొ.జగదీష్‌కుమార్‌కు పరిశోధన విద్యార్థులు కలిసి పలు సమస్యలపై వినతి పత్రం ఇచ్చారు. నాన్‌నెట్ ఫెలోషిప్ ఇవ్వాలని, ఎస్సీ విద్యార్థుల ఫెలోషిప్‌లకు నెట్ నిబంధనను రద్దు చేసి, 2017లో పీహెచ్‌డీ ప్రవేశాలు పొందిన విద్యార్థులకు కరోనా కారణంగా సకాలంలో పూర్తి చేయనందున రెండు సంవత్సరాల గడువు ఇవ్వాలని కోరారు. వినతి ఇచ్చిన వారిలో బీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వేల్పుల సంజయ్, ఓయూ జాక్ చైర్మన్ కొత్తపల్లి తిరుపతి, తదితరులు ఉన్నారు.

'టీడీపీకి పూర్వ వైభవం ఖాయం'

రాంగోపాల్‌పేట్: తెలంగాణ రాష్ట్రంలో తెలుగు దేశం పార్టీకి పూర్వ వైభవం తెచ్చేందుకు ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలని మాజీ ఎమ్మెల్యే కాట్రగడ్డ ప్రసూన పిలుపునిచ్చారు. శుక్రవారం ఇంటింటికి తెలుగు దేశం కార్యక్రమంలో భాగంగా ఆమె రాంగోపాల్‌పేట్ డివిజన్‌లోని నల్లగుట్టలో ఇంటింటికి వెళ్లి తెలుగుదేశం పార్టీ చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల గురించి వివరించారు. గత 8 ఏళ్ల నుంచి హైదరాబాద్‌లో బీఆర్ఎస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు ఏమీ లేవన్నారు. ఈ కార్యక్రమంలో సతీష్‌కుమార్, ఎం రాజు, హేమలత, వాహిద్, బోనాల శ్రీనివాస్‌గౌడ్, మధు పాల్గొన్నారు.

సామాజిక పునాదిలో పురుషాధిపత్యం

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: సామాజిక పునాదిలో పురుషాధిపత్యం, కులం, మతం ఆవహించి ఉన్నాయని వీటి ఆధిపత్యం పెరిగిపోతుందని ప్రొఫెసర్ హరగోపాల్ అన్నారు. 'ఏకీభవించనోని పీక నొక్కే సిద్ధాంతమే ఫాసిజమని' ఆయన పేర్కొన్నారు. శుక్రవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో రాయల సుభాష్‌చంద్రబోస్ (రవన్న) 7వ వర్ధంతి సందర్భంగా 'భారతదేశం ఫాసిస్టు ప్రమాదం' అనే అంశంపై స్మారకోపన్యాసం జరిగింది. ఈ సందర్భంగా హరగోపాల్ మాట్లాడుతూ.. పురుషాధిపత్యం వల్లనే మహిళలపై హింస, అణచివేత పెరిగిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. స్త్రీని రెండో శ్రేణి పౌరులుగా మారుస్తున్నారన్నారు. వీక్షణం ఎడిటర్ ఎన్.వేణుగోపాల్, సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా నాయకురాలు కె.రమా, అఖిల భారత విద్యావేదిక నాయకులు రమేష్‌పట్నాయక్, సామాజిక వేత్త దేవి, రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు, కే.జీ.రామచందర్, రంగయ్య, వెంకటేశ్వర్లు, మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య, ఎం.హన్మేష్, పద్మ, ప్రభాకర్ తదితరులున్నారు.

నిద్ర భంగం చేశారని విద్యార్థులను చితకబాదిన ఉపాధ్యాయుడు





ఆశీష్‌కుమార్

రసూల్‌పురా: తన నిద్ర భంగం చేశారని ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడికి విద్యార్థులను స్కేలుతో చితకబాదాడు. వివరాలిలా ఉన్నాయి.. వెంకటేష్ రేణుకల కుమారుడు ఆశీష్‌కుమార్ మడ్‌ఫోర్ట్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఒకటో తరగతి చదువుతున్నాడు. గురువారం మధ్యాహ్నం భోజన విరామ సమయంలో విద్యార్థులు లేకపోవడంతో రవికుమార్ అనే ఉపాధ్యాయుడు తరగతి గదిలో నిద్రిస్తున్నాడు. విరామం అనంతరం విద్యార్థులు తరగతి గదికి రాగా శబ్దం రావడంతో నిద్ర భంగమైందని కోపోద్రిక్తుడైన రవికుమార్ స్కేల్‌తో పలువురు విద్యార్థులతో పాటు తన టేబుల్ దగ్గర ఉన్న ఆశీష్‌కుమార్ పిక్కలు, మోకాలి కింది భాగంలో కొట్టాడు. ఈ విషయం సదరు విద్యార్థి తల్లిదండ్రులకు చెప్పలేదు. శుక్రవారం స్నానం చేయించే సమయంలో తల్లి నల్లగా కమిలినట్లు ఉండటం గమనించి ఆరా తీయగా ఉపాధ్యాయుడు కొట్టినట్లు తెలిపాడు. పాఠశాలకు వెళ్లి నిలదీయగా తాను కొట్టలేదని తప్పించుకునే ప్రయత్నం చేశాడు. మిగతా విద్యార్థులు సైతం తమని కూడా కొట్టాడని చెప్పడంతో శుక్రవారం కార్ఖాన పీఎస్‌లో రవికుమార్‌పై ఫిర్యాదు చేశారు.

3 కేంద్రాలు.. 454 మంది ఓటర్లు

- లష్కర్‌లో ఎమ్మెల్సీ ఎన్నికల సందడి
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు



తార్నాకలో పోలింగ్ కేంద్రంగా ఏర్పాటు చేసిన సంఘీ విద్యానికేతన్

సికింద్రాబాద్: సికింద్రాబాద్‌లో ఎమ్మెల్సీ ఎన్నికల సందడి మొదలైంది. ఈ నెల 13న నిర్వహించనున్న మహబూబ్‌నగర్, రంగారెడ్డి, హైదరాబాద్ నియోజకవర్గ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ జరుగనుంది. ఇందుకోసం సికింద్రాబాద్, బేగంపేట జీహెచ్ఎంసీ సర్కిళ్ల పరిధిలో 3 కేంద్రాలను ఏర్పాటు చేశారు. తార్నాక వైట్‌హౌజ్ సమీపంలోని సంఘీ విద్యానికేతన్ పాఠశాల, మారేడుపల్లిలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల, ఎస్‌పీ రోడ్డులోని వెస్లీ బాయ్స్ డిగ్రీ కళాశాలలో పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈసారి జరుగనున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో సికింద్రాబాద్ ప్రాంతం నుంచి మొత్తం 454 ఓట్లు ఉన్నాయి. తార్నాక సంఘీ పాఠశాలలో 286, మారేడుపల్లి ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో 67, వెస్లీ బాయ్స్ డిగ్రీ కళాశాలలో 101 మంది ఉపాధ్యాయులు ఓటు హక్కును వినియోగించుకునేందుకు ఎన్నికల అధికారులు ఏర్పాట్లు చేశారు.

జోరందుకున్న ప్రచారం..

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి అన్ని పోలింగ్ కేంద్రాల్లో అవసరమైన ఏర్పాట్లను ఎన్నికల అధికారులు ఇప్పటికే పూర్తి చేశారు. పోలింగ్ కేంద్రాలను ఎన్నికల అధికారులు, ఆయా ప్రాంతాల పోలీసు అధికారులు శుక్రవారం మరోమారు సందర్శించారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ నిబంధనలను ఇప్పటికే ఆయా ప్రాంతాల జీహెచ్ఎంసీ, పోలీసు అధికారులు అమలు చేస్తున్నారు. పోలింగ్‌ను ప్రశాంతంగా ముగించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నారు. మరోవైపు ఎన్నికల బరిలో ఉన్న అభ్యర్థులు ఈ ప్రాంతంలోని ఓటర్లను వ్యక్తిగతంగా కలుస్తూ తమ విజయానికి సహకరించాలని కోరుతున్నారు. ఉపాధ్యాయ ఎన్నికలకు సంబంధించి ఏర్పాటు పూర్తి చేశామని ప్రశాంతంగా పోలింగ్ తంతును ముగిస్తామని జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్ బి.శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఉపాధ్యాయులు అందరు సకాలంలో తమ ఓటు హక్కును వినియోగించుకుని వందశాతం పోలింగ్ పూర్తిచేసేందుకు సహకరించాలని ఆయన పిలుపునిచ్చారు.

మా ఓట్లు మాకు కావాలి

బోర్డు ముట్టడికి యత్నం



బాధితులతో కలిసి బోర్డు కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న క్రిశాంక్

కంటోన్మెంట్: మా ఓట్లు మాకు కావాలంటూ భారీ సంఖ్యలో మహిళలు బోర్డు ముట్టడికి తరలివచ్చారు. కంటోన్మెంట్ బోర్డు ఎన్నికల జాబితా నుంచి వేలాది ఓట్లు తొలగించడం అన్యాయం అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. బోర్డు అధికారులు తమకు న్యాయం చేయాలని శుక్రవారం ఆందోళనకు దిగారు. తెలంగాణ ఖనిజాభివృద్ధి సంస్థ చైర్మన్ మన్నె క్రిశాంక్ ఆధ్వర్యంలో వందలాది మహిళలతో పాటు పెద్ద సంఖ్యలో ఓట్లు కోల్పోయిన బాధితులు బోర్డు ముట్టడికి వచ్చారు. ముందస్తు సమాచారంతో పోలీసులు అప్పటికే బోర్డు కార్యాలయంలోకి వెళ్లే మార్గాలను మూసేశారు. ప్రధాన మార్గానికి అడ్డుగా బారికేడ్లు, బస్సు నిలిపి ఆందోళనకారులు లోపలకి వెళ్లకుండా అడ్డుకోవడంతో రోడ్డుపైనే బైఠాయించి న్యాయం చేయాలనే నినాదాలతో హోరెత్తించారు. ఈ సందర్భంగా క్రిశాంక్ మాట్లాడుతూ.. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో ఓటు ఉన్నప్పటికీ, బోర్డు ఎన్నికల్లో ఓట్లు తొలగించడం సరికాదన్నారు. ఎలాంటి ముందస్తు నోటీసులు ఇవ్వకుండానే సుమారు 35వేల మంది ఓట్లు తొలగించడం అన్యాయం అని దీనిపై తాము గతంలోనూ ఆందోళన చేపట్టామన్నారు. ఇప్పుడు వేలాది మందికి ఓట్లు లేకుండానే బోర్డు ఎన్నికలు నిర్వహించేందుకు యత్నిస్తున్నారని ఆరోపించారు. సీఈఓ మధుకర్ నాయక్ అందుబాటులో లేకపోవడంతో ఆఫీస్ సూపరింటెండెంట్ అక్బర్ అలీ ఆందోళనకారుల వద్దకు వచ్చి వినతి పత్రం స్వీకరించారు.

శభాష్.. పోలీస్

- ఆత్మహత్యాయత్నాన్ని అడ్డుకున్న జీఆర్పీ కానిస్టేబుల్



షేక్‌రబ్బానీని కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న పోలీసులు

సికింద్రాబాద్: రైలుకింద పడి ఆత్మహత్య చేసుకునేందుకు యత్నించిన ఓ యువకుడిని సికింద్రాబాద్ రైల్వే పోలీసులు కాపాడారు. జీఆర్‌పీ పోలీసుల కథనం ప్రకారం.. బాబుపల్లికి చెందిన షేక్ రబ్బానీ (21) ఇంజినీరింగ్ చదువుతున్నాడు. విద్యార్థి దశలోనే ఆర్థిక సమస్యలు తీవ్రం కావడంతో ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకున్నాడు. శుక్రవారం సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌కు చేరుకుని రైలుకింద పడేందుకు యత్నిస్తున్న అతడిని గుర్తించిన జీఆర్‌పీ కానిస్టేబుల్ సకాలంలో అక్కడకు చేరుకుని రబ్బానీని కాపాడాడు. కౌన్సెలింగ్ ఇచ్చిన అనంతరం వారి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

చలివేంద్రాల ఏర్పాటు అభినందనీయం

లాలాపేట: వేసవిలో పాదచారుల దాహార్తి తీర్చడానికి చలివేంద్రాలు ఎంతో దోహదపడుతాయని డిప్యూటీ మేయర్ మోతే శ్రీలతాశోభన్‌రెడ్డి అన్నారు. బీఆర్ఎస్ నాయకులు, సామాజిక కార్యకర్త పి. మధుబాబు ఆధ్వర్యంలో లాలాపేట, శాంతినగర్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన చలివేంద్రాలను శుక్రవారం ఆమె ప్రారంభించి మాట్లాడారు. పార్టీ నాయకులుగా ఉంటూనే మరో వైపు సామాజిక సేవా కార్యక్రమాలను కొనసాగిస్తున్న మధుబాబును ఆమె అభినందించారు. వేసవిలో తాగునీటిని ఎవరూ వృథా చేయరాదని సూచించారు. ఈ కార్యక్రమంలో మోతే శోభన్‌రెడ్డి, రామ్‌చందర్, శ్రీరాం శివకుమార్, వినోద్, అర్జున్, దేవయ్య, జి. వినోద్, ప్రదీప్, జునైద్, రషీద్ పాల్గొన్నారు.



చలివేంద్రాన్ని ప్రారంభించిన శ్రీలతాశోభన్‌రెడ్డి

త్వరలో మహిళా సంఘాలకు కేంద్రం శుభవార్త

బోర్డు సభ్యుడు రామకృష్ణ



మహిళా దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న అనురాధ-రామకృష్ణ

కంటోన్మెంట్: కేంద్ర ప్రభుత్వం నుంచి త్వరలోనే మహిళా సంఘాలకు శుభవార్త అందనుందని బోర్డు సభ్యుడు రామకృష్ణ అన్నారు. బోర్డు మాజీ సభ్యురాలు జి.అనూరాధ ఆధ్వర్యంలో ఐదో వార్డు మహాత్మాగాంధీ నగర్‌లో నిర్వహించిన మహిళా దినోత్సవ వేడుకలకు ఆయన హాజరై మాట్లాడారు. మహిళా సంఘాలకు ప్రస్తుతం ఇస్తున్న రుణ పరిమితి రూ.10 లక్షల నుంచి రూ.30 లక్షలకు పెరగనుందన్నారు. రాష్ట్రంలో అమలవుతున్న పలు సంక్షేమ పథకాల్లో కేంద్రం వాటా ఉందన్నారు. కంటోన్మెంట్ పట్ల రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్య వైఖరి అవలంభిస్తోందన్నారు. ముఖ్యంగా కంటోన్మెంట్ ప్రజలకు రోజుకు 90 లక్షల గ్యాలన్ల నీరు అవసరం ఉండగా, కేవలం 59 లక్షల గ్యాలన్లు మాత్రమే సరఫరా చేస్తోందన్నారు. ఈ నేపథ్యంలోనే బీజేపీ ఆధ్వర్యంలో నీటి పోరు చేపట్టామన్నారు. బీజేపీ నీటి పోరుకు స్థానికులు తమ సంతకాల ద్వారా మద్దతు తెలపాలన్నారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో అమీర్‌పేట కార్పొరేటర్ సరళ, తదితరులు పాల్గొన్నారు.

ప్రొ. నతానియేలును గెలిపించండి

- ప్రొ. గాలి వినోద్‌కుమార్



ప్రొ. గాలి వినోద్‌కుమార్ మద్దతు కోరుతున్న నతానియేలు

లాలాపేట: త్వరలో జరగనున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న ఉస్మానియా యూనివర్సిటీ ప్రొ. నతానియేలుకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని దక్షిణ భారత సమితి కన్వీనర్, ఓయూ లా కళాశాల డీన్ ప్రొ. గాలి వినోద్‌కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం తన కార్యాలయంలో ఓయూ రిటైర్డు ప్రొ. పి.ముత్తయ్యతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో గాలి వినోద్‌కుమార్ మాట్లాడారు. ప్రాథమిక స్థాయి నుంచి ఉపాధ్యాయులుగా, ప్రస్తుతం ఓయూ ప్రొఫెసర్‌గా విద్యారంగం పట్ల నతానియేలుకు సంపూర్ణ అవగాహన ఉందన్నారు. ఈ ఎన్నికల్లో అన్ని పార్టీల నుంచి అగ్రవర్ణ అభ్యర్థులు పోటీ చేస్తున్నారని వారిలో ఎవరికీ ఓటు హక్కు లేదని ఎస్సీ మాదిగ సామాజిక వర్గానికి చెందిన ప్రొ. నతానియేలుకు మాత్రమే ఓటు హక్కు ఉందన్నారు. ఈయనకు తాము సంపూర్ణ మద్దతును ప్రకటిస్తున్నట్లు పేర్కొన్నారు. అంతకు ముందు సావిత్రిబాయి పూలే వర్ధంతి నిర్వహించి ఆమె చిత్రపటానికి నివాళులర్పించారు.

సైన్స్ అభివృద్ధితోనే మెరుగైన జీవనం

ప్రొ. గోపాల్‌రెడ్డి



పోస్టర్ ప్రదర్శనను తిలకిస్తున్న ప్రొ. గోపాల్‌రెడ్డి

లాలాపేట: రోజువారి పనులను సులభతరం చేసేలా సైన్స్ ఎంతో అభివృద్ధి చెందిందని నల్గొండ మహాత్మాగాంధీ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ గోపాల్‌రెడ్డి అన్నారు. సీఎస్ఐఆర్-ఐఐసిటిలో కొనసాగుతున్న వన్ వీక్ వన్ ల్యాబ్ ప్రచార కార్యక్రమంలో భాగంగా శుక్రవారం యువ శాస్త్రవేత్తలు సైన్స్ రంగంలో కొనసాగుతున్న పరిశోధనలు, సైన్స్ అభివృద్ధిపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రొ. గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. అభివృద్ధి చెందిన సాంకేతిక పరిజ్ఞానంతో నేడు విద్యార్థులు మెరుగైన జీవనం సాగిస్తున్నారని పేర్కొన్నారు. సైన్స్ రంగంపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదపడుతాయన్నారు. సీసీఎంబీ డైరెక్టర్ డాక్టర్ వినయ్ కె నందుకూరి మాట్లాడుతూ.. గతంలో సైన్స్ అంతగా అభివృద్ధి చెందని కారణంగా ఏదైనా మహమ్మారి వస్తే భారీ సంఖ్యలో ప్రాణనష్టం సంభవించేదని ప్రస్తుతం సాధించిన సైన్స్ పురోగతి వల్ల కోవిడ్ వైరస్ లాంటి మహమ్మారిని ఎదుర్కొగలిగామన్నారు. నిత్య జీవితంలో కెమిస్ట్రీ పాత్ర, ఐఐసిటిలో కొనసాగుతున్న పరిశోధలను డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి విద్యార్థులకు వివరించారు.

రోడ్డు ప్రమాదాల నివారణ అందరి బాధ్యత

ట్రాఫిక్ అదనపు కమిషనర్ సుధీర్‌బాబు



విద్యార్థులకు హెల్మెట్లు అందించిన సుధీర్‌బాబు

రాంగోపాల్‌పేట్: రోడ్డు ప్రమాదాలను నివారించడం అందరి బాధ్యత అని ట్రాఫిక్ అదనపు పోలీస్ కమిషనర్ సుధీర్‌బాబు అన్నారు. శుక్రవారం బేగంపేటలోని ట్రాఫిక్ శిక్షణా కేంద్రాన్ని ఆయన సందర్శించి వివిధ కళాశాలలకు చెందిన ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ కేడెట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో మరణాలకు మూడో పెద్ద కారణంగా రోడ్డు ప్రమాదాలని ఈ మరణాల సంఖ్యను తగ్గించాలంటే ప్రతి ఒక్కరు ట్రాఫిక్ నిబంధనలు, రోడ్డు భద్రతా ప్రమాణాలను పాటించాలన్నారు. డ్రైవింగ్ లైసెన్సు ఉంటేనే వాహనాలను నడపాలని ట్రాఫిక్ వలంటీర్లుగా పనిచేసేందుకు ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు ముందుకు రావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ట్రాఫిక్ ఇబ్బందులతో పాటు అత్యవసర సమయాల్లో విద్యార్థుల సేవలను వినియోగించుకుంటామని ఆయన పేర్కొన్నారు. అనంతరం విద్యార్థులకు హెల్మెట్లను అందించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ అదనపు డీసీపీ రంగారావు, టీటీఐ ఏసీపీ శంకర్‌రాజు, ఇన్‌స్పెక్టర్ నాగరాజు పాల్గొన్నారు.

మహిళా సాధికారతకు 'పూలే' రాజీలేని పోరాటం



నివాళులర్పిస్తున్న బీసీ సంక్షేమ సంఘం నాయకులు

బన్సీలాల్‌పేట్: మహిళా సాధికారతకు సావిత్రీబాయి పూలే రాజీలేని పోరాటం చేశారని జాతీయ బీసీ సంక్షేమ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం. బాలక్రిష్ణ పేర్కొన్నారు. బన్సీలాల్‌పేట్ డివిజన్ కవాడిగూడ సీజీఓ టవర్స్ వద్ద శుక్రవారం నిర్వహించిన సావిత్రి బాయి పూలే వర్ధంతిలో ఆయన పాల్గొని ఆమె చిత్రపటానికి నివాళి అర్పించి మాట్లాడారు. సమాజంలో నాడు సాంఘిక అసమానతలపై విరోచితంగా పోరాడి వితంతులు, అనాథల కోసం ప్రత్యేక పాఠశాలలను ఏర్పాటు చేశారన్నారు. అట్టడుగు వర్గాల అభ్యున్నతి, వికాసానికి కృషి చేసిన నాయకురాలు సావిత్రి బాయి పూలే ఆదర్శమన్నారు.

ఓయూలో..

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో సావిత్రీబాయి పూలే వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. శుక్రవారం బీఎస్ఎఫ్, ఓయూ జాక్ ఆధ్వర్యంలో ఆర్ట్స్ కాలేజీ ఎదుట సావిత్రిబాయి చిత్రపటం ఏర్పాటు చేసి నివాళులర్పించారు. క్యాంపస్‌లోని వివిధ కార్యాలయాలు, కాలేజీలతో పాటు వీసీ కార్యాలయంలోని సెనెట్ హాల్ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సెల్స్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వీసీ ప్రొ.రవీందర్ పాల్గొని నివాళులర్పించారు.



ఓయూలో నివాళి అర్పిస్తున్న దృశ్యం

ఇళ్ల పట్టాల క్రమబద్ధీకరణ చేపట్టాలి

బౌద్ధనగర్: బౌద్ధనగర్ డివిజన్‌లోని అంబర్‌నగర్, పార్శీగుట్టలోని అశోక్‌నగర్‌లో ఇళ్ల పట్టాల క్రమబద్ధీకరణ చేపట్టాలని టీడీపీ సికింద్రాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వల్లారపు శ్రీనివాస్ రెవెన్యూ అధికారులను కోరారు. శుక్రవారం ఆయన స్థానిక టీడీపీ నాయకులతో కలిసి రెవెన్యూ డివిజనల్ అధికారి కార్యాలయంలోని అడ్మిన్ ఆఫీసర్ డీఎస్ రజినికి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమస్యపై గత కొద్ది సంవత్సరాల నుంచి స్థానిక ప్రజలు పోరాడుతున్నారన్నారు. ఇళ్ల పట్టాలకు సంబంధించి సర్వే, విచారణ పూర్తయి చాలా రోజులైనా ఇంతవరకు పట్టించుకోలేదని వెంటనే ఈ సమస్యను పరిష్కరించాలని కోరారు. వినతి ఇచ్చిన వారిలో మంద వెంకటస్వామి, శ్రీశైలం ఉన్నారు.

క్రమశిక్షణతో ఉన్నత శిఖరాలు సాధ్యం

పంజగుట్ట: పాఠశాల దశ నుంచే విద్యార్థులు క్రమ శిక్షణ అలవర్చుకుంటే జీవితంలో ఉన్నత శిఖరాలు అధిరోహిస్తారని పంజగుట్ట ఏసీపీ మోహన్‌కుమార్ అన్నారు. శుక్రవారం ఎర్రమంజిల్ కాలనీలోని రబీంద్ర నికేతన్ పాఠశాలలో స్పోర్ట్స్ డే వేడుకలను ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ, ప్రస్తుతం విద్యార్థులకు పరీక్షా కాలమని, పరీక్షలంటే భయపడకుండా ప్రణాళికాబద్ధంగా చదువుకుంటే మంచి మార్కులు సాధించవచ్చని అన్నారు. ఫోన్లు, టీవీలు చూడకుండా కష్టపడి చదవాలని అన్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్, కరస్పాండెంట్ కరుణ మాట్లాడుతూ, అణగారిని వర్గాల పిల్లలకు విద్యనందించాలనే ఉద్దేశంతో ఫౌండర్ రేణుకా ముఖర్జీ ఈ పాఠశాలను స్థాపించారని, వారి ఆశయాలకు అనుగుణంగా విద్యార్థులు బాగా చదువుతున్నారని అన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో పంజగుట్ట డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ దుర్గారావు, పాఠశాల అధ్యక్షురాలు మీనాక్షి భట్టాచార్య తదితరులు పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో మహిళలు ముందంజ



బోయిన్‌పల్లిలో మహిళా దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న శ్రీగణేశ్

రసూల్‌పురా: నేటి సమాజంలో అన్ని రంగాల్లో పురుషులతో సమానంగా మహిళలు రాణిస్తున్నారని బోయిన్‌పల్లి మార్కెట్ మాజీ చైర్మన్ టీఎన్. శ్రీనివాస్ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాల్లో భాగంగా శుక్రవారం రెండవ వార్డు రసూల్‌పురా గన్ బజార్ కమ్యూనిటీ హాల్లో బీఆర్ఎస్ మహిళా నాయకురాలు సుమిత్రా శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సామాజిక, రాజకీయ రంగాల్లో అవకాశాలను అందిపుచ్చుకుంటూ మహిళలు బేషుగ్గా రాణిస్తున్నారని కొనియాడారు. సుమిత్ర మాట్లాడుతూ.. ఈసారి జరిగే ఎన్నికల్లో రెండవ వార్డు నుంచి తాను బీఆర్ఎస్ పార్టీ నుంచి పోటీ చేస్తున్నట్లు వెల్లడించారు. తనకు మద్దతు ఇచ్చి గెలిపిస్తే మహిళల సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీల్లో ప్రతిభ కనబర్చిన వారికి బహుమతులు అందజేశారు. బోయిన్‌పల్లి మార్కెట్ కమిటీ సభ్యులు దేవులపల్లి శ్రీనివాస్, షేక నయిం, కుమార్, శ్యామ్‌రెడ్డి, నర్సింహ్మ, ప్రవీణ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టీఎన్. శ్రీనివాస్

రాజకీయాల్లోనూ రాణించాలి..

కంటోన్మెంట్: మహిళలు రాజకీయ రంగంలోనూ రాణించాల్సిన అవసరం ఉందన్నారు బీఆర్ఎస్ నేత ఎస్. శ్రీగణేశ్ పేర్కొన్నారు. మహిళా దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం బోయిన్‌పల్లి ఒకటోవార్డు కంటోన్మెంట్ ప్లే గ్రౌండ్ ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎందరో మహిళల ధైర్య సాహసం, త్యాగం వల్లే మహిళలకు సమానత్వం హక్కులు దక్కాయన్నారు. చరిత్రలో రాణి రుద్రమదేవి, సావిత్రి బాయి పూలే, నిఖత్ జరీన్, కల్పనా చావ్లా, మిథాలిరాజ్, సానియా మీర్జా, చాకలి ఐలమ్మ, ద్రౌపది ముర్మ్ లాంటి ఎందరో ప్రముఖులు ఆదర్శంగా ఉన్నారన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా



పవన్‌ను పరామర్శిస్తున్న రంగా రవీందర్ గుప్తా

రసూల్‌పురా: కంటోన్మెంట్ బోర్డు ఏడవ వార్డు నుంచి తాను పోటీలో ఉన్నానని తనకు ఒక్కసారి అవకాశమివ్వాలని బీఆర్ఎస్ నాయకులు, ఉద్యమకారులు రంగా రవీందర్ గుప్తా కోరారు. శుక్రవారం తిరుమలగిరిలోని వంగపల్లి గార్డెన్, గంగయ్య బట్టిలో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వంగపల్లి గార్డెన్ బస్తీలో ప్రజల సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఇటీవల గంగయ్య బట్టిలో రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆర్థిక పరిస్థితి బాగలేక చికిత్స చేయించుకోలేని స్థితిలో ఉన్న పవన్‌ను పరామర్శించి రవీందర్ గుప్తా ఆర్థిక సాయం అందజేశారు. పూర్తిగా కోలుకునే వరకు తాను ఆస్పత్రి ఖర్చులు భరిస్తానని భరోసా కల్పించారు. దయాకర్ రావు, ప్రవీణ్ యాదవ్, సంగీతా యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

'ఏఐసీఎఫ్' నూతన కార్యవర్గం ఎన్నిక

రాంగోపాల్‌పేట్: ఆల్ ఇండియా క్రిష్టియన్ ఫెడరేషన్ (ఏఐసీఎఫ్) తెలంగాణ శాఖకు నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. శుక్రవారం రెజిమెంటల్‌బజార్‌లోని అమృతవాణిలో జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఏఐసీఎఫ్ రాష్ట్ర పర్యవేక్షకులు వెంకట్‌నాథ్, జాతీయ అధ్యక్షులు గద్దపాటి విజయరాజు ఆధ్వర్యంలో రాష్ట్ర అధ్యక్షులుగా నారబోయిన ప్రదీప్, ప్రధాన కార్యదర్శిగా బిషప్ జీ శామ్యుల్, కోశాధికారిగా బిషప్ ఎంఎస్ దయానంద్, రాష్ట్ర సహాయ కార్యదర్శిగా బిషప్ మూర్తిని ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర మాజీ అధ్యక్షులు రెవరెండ్ డేవిడ్ కడారి, జాతీయ ముఖ్య సలహాదారులు జ్యోతి నీలయ్య, యువజన నాయకులు అమర్ పాల్గొన్నారు.

